క్లుప్తంగా

పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నేడు



ప్రత్యేక అలంకరణలో ఉమా రామలింగేశ్వరస్వామి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి బాలచెరువులో గల ఉమా రామ లింగేశ్వర స్వామి ఆలయ 34వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకుడు బంకుపల్లి వాసుదేవ శర్మ తెలిపారు. 29న గురువారం నిర్వహించే పార్వతీ పరమేశ్వరుల కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

పేదల ఆరోగ్యానికి మోదీ గ్యారంటీ



ఆరోగ్య కార్డులు అందజేస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

గాజువాక: పేదల ఆరోగ్యానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా కల్పిస్తున్నారని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను గాజువాకలోని ముఠా కార్మికులకు బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డు ద్వారా రూ.5 లక్షల వరకు వైద్య సదుపాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాటా శ్రీను, శంకరరావు, మేస్త్రీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

కూర్మన్నపాలెం: గుర్తు తెలియని ఆగంతకుడు మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కుని పోయిన ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 86వ వార్డు పరిధి కూర్మన్నపాలెం దువ్వాడ సెక్టార్ – 1లో కిరాణా షాపు నిర్వహిస్తున్న తానాల రమణ భార్య తానాల లక్ష్మి ఎప్పటిలాగానే బుధవారం ఉదయం 11 గంటల సమయంలో షాపు వద్దకు వచ్చింది. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అక్కడకు వచ్చి కూల్‌డ్రింక్ కావాలని అడగ్గా... కూల్ డ్రింక్ కోసం షాపులోకి వెళ్లిన లక్ష్మి మెడలోని ఒకటిన్నర తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. వెంటనే ఆమె తేరుకుని కేకలు వేస్తూ పరుగెత్తగా అప్పటికే ఆ దొంగ పారిపోయాడు. జరిగిన విషయాన్ని దువ్వాడ క్రైమ్ పోలీసులకు వివరించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

కొత్తగా నాలుగు కేంద్రాలకు పౌష్టికాహారం



మాట్లాడుతున్న హెచ్‌బీఎల్ అధికారి విజయలక్ష్మి

అగనంపూడి: దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని హైదరాబాద్ బ్యాటరీస్ లిమిటెడ్ సంస్థ మరో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇప్పటికే జీవీఎంసీ 86, 88వ వార్డుల్లోని 11 అంగన్‌వాడీ కేంద్రాలకు ఐదేళ్ల నుంచి పౌష్టికాహారం అందిస్తోంది. ఈ మేరకు ఈ ఏడాది నుంచి మరో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు తలారివానిపాలెం, మంగళపాలెం, దువ్వాడ సెక్టార్ – 2, నర్సింగవానిపాలెంలోని 75 మంది చిన్నారులకు పౌష్టికాహారం అదనంగా అందిస్తున్నట్లు ఆ సంస్థ అధికారి విజయలక్ష్మి చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌బీఎల్ మేనేజర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



కౌంటర్ వద్ద రిజిస్ట్రేషన్ కోసం స్థానికులు



రోగులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, సమన్వయకర్త రామచంద్రరావు, తదితరులు

గాజువాక: పేదలకు పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని తపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 71వ వార్డు అఫీషియల్ కాలనీలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అడుగులేశారన్నారు. తమకు వైద్యం అందలేదని రాష్ట్రంలో ఏ కుటుంబమూ బాధపడకుండా చూడటమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. అందులో భాగంగానే జగనన్న సురక్ష కార్యక్రమం పేరుతో నిరంతరాయంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. అవసరమైన రోగులను మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రికి తరలిస్తారన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం పేదల కోసం ఆలోచిస్తున్నారన్నారు. వారికి మెరుగైన వైద్యం అందాలన్న ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఒకపక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధితోపాటు ఆరోగ్యానికి కూడా పెద్దపీట వేసిన ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వైద్యాధికారులు 321 మందికి వైద్య సేవలు అందించారు. మరో 39 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, జీవీఎంసీ గాజువాక సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, పీహెచ్‌సీ సామాజిక ఆరోగ్యాధికారి పి.నాగ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' దేశానికే ఆదర్శం

పెదగంట్యాడ: జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఈ పథకం ప్రజారోగ్యానికి రక్షగా నిలుస్తోందని దేవాడ పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి ఎస్.రవీంద్ర అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు గొల్లపేట సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ నాణ్యమైన వైద్యం అందుతోందన్నారు. రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఇంటి వద్దకే అందిస్తున్నారన్నారు. శిబిరాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నామని, శస్త్రచికిత్సల కోసం ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నామన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తోందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమం దేశంలో మన రాష్ట్రంలోనే అమలు చేస్తున్నారన్నారు. వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. శిబిరంలో 458 మందికి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా, జనరల్ డాక్టర్ చైతన్యవర్మ, చిన్న పిల్లల వైద్యురాలు డాక్టర్ విజయలక్ష్మి పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కురం అప్పారావు, ఎంపీ రెడ్డి, ఆరోగ్య సిబ్బంది జైనాబ్, ఎం.శ్రీనివాసరావు, కె.అన్నపూర్ణ, బి.గోపాలం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోగికి మందులు అందజేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఫైర్ సేఫ్టీ ముఖ్యం

గాజువాక: షాపింగ్ మాళ్లలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీలపై ఆయా యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. గాజువాకలో అగ్ని ప్రమాదానికి గురైన కమర్షియల్ కాంప్లెక్స్‌ను 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మెయిన్ రోడ్‌లో అనేక షాపింగ్ భవనాలకు కనీసం పార్కింగ్ సౌకర్యం లేదని, సెల్లార్ అనుమతులు, ఫైర్ సేఫ్టీలు అమలు కావడం లేదన్నారు. ఫైర్ సేఫ్టీ లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఈ విషయాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి అన్ని నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న ఉరుకూటి చందు

జాబ్‌మేళాలో 137 మంది ఎంపిక

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్. సుబ్బిరెడ్డి(క్లరికల్) శాంతి(టెక్నికల్) తెలిపారు. సుమారు 10 ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 620 ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 380 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 137 మంది ఎంపికైనట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

వేడుకగా పర్వత ఆంజనేయ స్వామి పరస



అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం వివేకానంద కాలనీలో కొలువైన శ్రీ పర్వత ఆంజనేయ స్వామి పరస మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో భక్తులకు స్వామి దర్శనమిచ్చారు. పరసలో స్టాళ్ల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకుంది. భక్తజన సందోహంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఆలయం వద్ద గరిడి, డప్పు వాయిద్యాలు మిన్నంటాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు బాణసంచా కాల్చుతూ సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా టైలర్స్ డే



సీనియర్స్ టైలర్లను సత్కరిస్తున్న నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ప్రపంచ టైలర్స్ డేను నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. షీలా సిగ్నల్ పాయింట్ వద్ద అసోసియేషన్ సభ్యులు కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికినిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రెడీమేడ్స్ దుస్తులు అందుబాటులోకి రావటంతో టైలర్ వృత్తికి ఆదరణ తగ్గిందన్నారు. దీంతో టైలర్స్ ఆదాయం చాలక వారి వృత్తిని వదిలి కుటుంబ పోషణకు ఇతర పనులకు వెళ్లే పరిస్థితి ఎదురవుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ.10 వేలు అందజేయడంతో ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో టైలర్స్ అందరూ తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. టైలర్స్ అందరూ ఐక్యంగా ఉండి వృత్తి దారులకు ఏకష్టం వచ్చినా అండగా నిలవాలన్నారు. అనంతరం సీనియర్స్ టైలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కునూరు మల్లికేశ్వరరావు, పుప్పాల వెంకటరమణ, ఎ.ప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ న్యాయ సలహాదారులు తెలంగారెడ్డి పుల్లయ్య నాయుడు, దొడ్డి శ్రీను, బొడ్డు సాంబశివరావు, గంగరాజు, ఎ.చిన్నారావు, ఎస్.శ్రీను, వెంకటరమణ, కె.శంకరరావు, శేఖర్, కె.సుజాత, ఎస్.కె. సైదాబి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పనిలో భద్రత ప్రధానం

అగనంపూడి: మన దైనందిన జీవనంలో చేసే ప్రతి పనిలో భద్రతను విస్మరించరాదని విశాఖ స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం హెచ్‌వోడీ దువ్వాడ రామ్‌ప్రసాద్ అన్నారు. జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా బుధవారం అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భద్రతా ప్రమాణాలు పాటిస్తే జీవితంలో ఎటువంటి భయం ఉండబోదన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో భద్రత విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నామని, చిన్న చిన్న పొరపాట్ల వల్ల చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. బాలలు భద్రత విషయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నాయకులు ఎల్లపు సాంబశివరావు, బలిరెడ్డి సత్యనారాయణ, ఉక్కు అధికారులు బయ్యే మల్లయ్య, పి.కృష్ణమూర్తి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న స్టీల్‌ప్లాంట్ అధికారులు

ఉద్యోగ విరమణ ప్రయోజనాలు చెల్లించాలి

ఉక్కునగరం: రిటైర్ అవుతున్న ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో చెల్లించాలని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.శంకరావు డిమాండ్ చేశారు. బుధవారం స్టీల్‌సిటీ డిపోలో ఈ నెల పదవీ విరమణ చేస్తున్న కండక్టర్ పి.నారాయణమ్మ, డ్రైవర్ ఎస్.పి.రాజును సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయోజనాలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్ సిటీ డిపోలో కొంత మంది సూపర్‌వైజర్లు ఒక అసోసియేషన్‌కు అనుకూలంగా పనిచేయడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి బి.రాము, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీహెచ్ఎస్ రావు, డిపో కార్యదర్శి కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు

పేదలకు దుప్పట్ల పంపిణీ

అగనంపూడి: ప్రపంచ దర్జీల దినోత్సవం సందర్భంగా నిరుపేదలకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రతినిధి కోసూరి తాతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉషా మిషన్ డీలర్ అధినేత మాతా గోవిందరావు, వరలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో అగనంపూడి ప్రాంతంలోని నిరుపేదలకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో వెయ్యాకుల శంకరరావు, పి.రవి, సత్యనారాయణ, బాబూరావు, యశోద కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.



దుప్పటి అందిస్తున్న అసోసియేషన్ ప్రతనిధులు

బాల మేధావులు.. భవిష్యత్ శాస్త్రవేత్తలు

- విద్యార్థులతో డీఈవో చంద్రకళ
- పాఠశాలల్లో సైన్స్ డే వేడుకలు
- అబ్బురపరిచిన వైజ్ఞానిక ప్రదర్శనలు



మిందీ జెడ్పీ హైస్కూల్‌లో సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



యారాడ హైస్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు

పెదగంట్యాడ: దేశ భవిష్యత్ బాల మేధావులైన విద్యార్థులపైనే ఆధారపడి ఉందని, పరిశోధనలపై ఆసక్తి చూపి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ ఆకాంక్షించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం పాఠశాలలు, కళాశాలల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనను డీఈవో ప్రారంభించారు. సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ సైన్స్ విద్యార్థులు ప్రతి అంశాన్ని సైంటిఫిక్ కోణంలో చూడాలన్నారు. ప్రకృతిలోని ప్రతి విషయాన్ని, ప్రతి వస్తువునూ పరిశోధనాత్మక కోణంలో చూసినప్పుడే విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, కొత్త ప్రశ్నలు రేకెత్తుతాయని చెప్పారు. వాటి పరిష్కారం దిశగా విద్యార్థులు చేసే కృషి సరికొత్త ఆవిష్కరణకు నాంది అవుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలు దిశగా సాగాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షణ ఏపీసీ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పి.రాజారావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

- విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను వెలికితీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం అన్నారు. విద్యార్థులు పలు అంశాలపై సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. సరోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆదర్శం.. సీవీ రామన్

అగనంపూడి: తార్కిక ఆలోచన మనిషి జీవితాన్ని మలుపు తిప్పడమే కాకుండా ఒక ఉన్నత స్థానంలో నిలుపుతుందని, దీనికి ఉదాహరణ సర్ సీవీ రామన్ ఎఫెక్ట్‌అని అనకాపల్లి జిల్లా విద్యా శాఖాధికారి వెంకటలక్ష్మమ్మ అన్నారు. జిల్లా విద్యా శాఖ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్తంగా లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విజ్ఞాన మేళాలో పాల్గొన్న విద్యార్థులను డీఈవో అభినందించారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు సారథ్యంలో అగస్త్య ఫౌండేషన్ ప్రతినిధులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



నడుపూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో చంద్రకళ

- నిత్య జీవితంలో మనిషి సైన్స్‌తో మమేకమై ఉన్నాడని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. కళాశాలలో సైన్స్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలకు బహుమతులు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.
- అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర మేళాలో విద్యార్థులు ఆలోచింపజేసేలా పలు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని 85, 79 వార్డుల కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఇల్లపు ప్రసాద్, హెచ్ఎం కృష్ణారావులు ప్రారంభించారు. కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి శ్రీను, ఉపాధ్యాయులు కృష్ణవేణి, టిజీటీ రవికుమార్, నాగభూషణం, మేరీ కుమారి పాల్గొన్నారు.



లంకెలపాలెం హైస్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అనకాపల్లి డీఈవో వెంకటలక్ష్మమ్మ

- 85వ వార్డు దానబోయినపాలెం ప్రాథమిక పాఠశాలలో స్కూల్ కమిటీ ప్రతినిధి యలమంచిలి అప్పారావు సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీలేఖ, సుజాత, నాయకులు ఎల్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. సీవీ రామన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్ట్‌లను హెచ్ఎం ఎం.ఎ ల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 29న కోరమండల్ ఇంటర్నేషనల్‌లో నిర్వహించనున్న సైన్స్ ఎగ్జిబిషన్‌కు తమ పాఠశాల నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.అన్నపూర్ణమ్మ, సావిత్రి దేవి, అనూరాధ, అన్నపూర్ణేశ్వరి, దేముళ్లు, కుమారస్వామి, పీడీ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

- 68వ వార్డు మిందీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించాఉ. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఎ స్.ఆంజనేయ, ఉపాధ్యాయులు పరిశీలించి అభినందించారు.



అగనంపూడి హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి



విజ్ఞాన్ కళాశాలలో సైన్స్ ఎక్స్‌పోను తిలకిస్తున్న విద్యార్థులు



అక్కిరెడ్డిపాలెం స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న హెచ్ఎం కాంతం, ఉపాధ్యాయులు

కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టేందుకే ప్రైవేటీకరణ

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని, ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆరోపించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1,112వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థలోని వివిధ విభాగాలు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రాగానే మినిమం పెన్షన్ ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణను ఆపాలని, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని కోరారు. ఉక్కు నిర్వాసితులకు శాశ్వత ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం తన తీరును మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులుపాల్గొన్నారు.



దీక్షలో పోరాట కమిటీ నాయకులు

ఘనంగా జేవీవీ ఆవిర్భావ దినోత్సవం

గాజువాక: జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవాన్ని గాజువాకలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేష్ కుమార్ మాట్లాడుతూ సైన్స్‌ను అభివృద్ధి చేసే క్రమంలో విద్యార్థులు శాస్త్ర దృక్పథాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై తాము నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురామ్ మాట్లాడుతూ తమ సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సైన్స్ ప్రాజెక్టు పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆ ప్రాజెక్టులను మూడు నిమిషాల్లోపు వీడియో తీసి జేవీవీ రాష్ట్ర కమిటీకి పంపించాలన్నారు. విజేతలకు జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జేవీవీ గాజువాక అధ్యక్షుడు ఎల్.కృష్ణారావు, నాయకులు బి.త్రినాథస్వామి, కె.వెంకటరావు, డి.శ్రీనివాసరావు, తులసీరత్నం, కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.



జేవీవీ జెండా ఆవిష్కరిస్తున్న రమేష్ కుమార్